క్లుప్తంగా

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ఆదిలాబాద్‌రూరల్: ఎలాంటి షరతులు లేకుండా రైతుకలు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం తుడుందెబ్బ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆరుగాలం శ్రమించి అన్నదాతలు పండించిన పత్తికి క్వింటాలుకు రూ.10వేల చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులందరికీ కటాఫ్ లేకుండా రైతు భరోసా వెంటనే ఇవ్వాలన్నారు. రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

'కంది' ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

ఆదిలాబాద్‌రూరల్: సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి సీతక్క, కాంగ్రెస్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి ఫ్లెక్సీలకు లాండ సాంగ్వి గ్రామ శివ మార్కండేయ ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఆదివారం క్షీరాభిషేకం చేశారు. లాండసాంగి శివ మార్కండేయ ఆలయంలో షెడ్ నిర్మాణం కోసం రూ.3 లక్షలు మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

తలమడుగు: మండలంలోని రుయ్యాడి గ్రామంలో ఆదివారం రైతుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. సోయాబీన్ ఎకరానికి 6 క్వింటాల నుంచి 10 క్వింటాళ్ల వరకు పెంచి కొనుగోలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రైతులు లోక ప్రవీణ్‌రెడ్డి, గోక రాంరెడ్డి, సురేశ్‌రెడ్డి, గణపతి రెడ్డి, గాజుల సాంబశివ్, ఉడుగు రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

సిరికొండలో భారీ వర్షం

సిరికొండ: మండల కేంద్రంలో ఆదివారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. భారీ వర్షం కురువడంతో చేతికొస్తున్న సోయా, మొక్క జొన్న పంటలకు నష్టం వాటిల్లిందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆదే విధంగా ఇప్పుడిప్పుడే చేతికొస్తున్న పత్తి పంట తడిసి ముద్దవుతుందని వాపోతున్నారు.

భక్తిమార్గంలో నడవాలి

తాంసి: ప్రతిఒక్కరూ భక్తిమార్గంలో నడవాలని సుందర చైతన్య శిష్యుడు కృష్ణానంద అన్నారు. గత వారం రోజుల నుంచి భీంపూర్ మండలంలోని గ్రామంలోని నిపాని గ్రామంలో సుందర కాండ ప్రవచనలు బోధించారు. ఆదివారం సుందరకాండ కార్యక్రమానికి ముగింపు పలికారు. సమాజంలో భక్తి వలన శాంతి లభిస్తుందన్నారు. అనంతరం కృష్ణానందను గ్రామస్తులు శాలువాతో సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. గ్రామపెద్దలు సుగుణాకర్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, కరుణాకర్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓటు నమోదు కేంద్రం ప్రారంభం



ప్రారంభిస్తున్న చిక్కాల దత్తు

ఆదిలాబాద్‌టౌన్: మెదక్, కరీంనగర్, నిజామాబాద్ ఆదిలాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి పడాల రవీందర్ మాధవ్ ఆధ్వర్యంలో ఆదిలాబాద్ జెడ్పీ కార్యాలయం ముందు గల శరణ్య జిరాక్స్ సెంటర్‌లో పట్టభద్రుల ఉచిత ఓటు నమోదు కేంద్రాన్ని జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు చిక్కాల దత్తు ప్రారంభించారు. ఈ సందర్భంగా పడాల రవీందర్ మాట్లాడుతూ డిగ్రీ చదివిన ప్రతిఒక్కరూ ఓటు నామోదు చేసుకోవాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ప్రభుత్వ గిరిజన పారిశ్రామిక శిక్షణ సంస్థ (ఐటీఐ) ఉట్నూర్ నందు ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుంచి 30 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల చేసుకోవాలన్నారు. దరఖాస్తు చేసుకొనే అభ్యర్థులు 10, 8 తరగతులు ఉత్తీర్ణులై ఉండాలన్నారు. వివరాలకు 94914 60060 సంప్రదించాలని కోరారు.

దిగుబడిపై ఆశలు..!



సోయా నూర్పిడి చేస్తున్న హార్వేస్టర్

- సోయాకు పెరిగిన దిగుబడులు
- కలిసొచ్చిన కాలం
- ఇప్పుడిప్పుడే చేతికొస్తున్న సోయా
- క్వింటాల్‌కు రూ. 592 పెరిగిన మద్దతు ధర

ఇచ్చోడ: కోటి ఆశలతో ఖరీఫ్‌లో సాగు చేసిన సోయా రైతులకు ఈఏడాది కలిసి వచ్చింది. నాలుగేళ్ల తర్వాత మంచి దిగుబడులు వస్తున్నాయి. విత్తనాలు వేసిన నుంచి వర్షం దంచికొట్టినా.. దిగుబడిపై పెద్దగా ప్రభావం చూపలేదు. గతేడాది ఎకరాకు 4– 5 క్వింటాళ్ల మాత్రమే దిగుబడి రాగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది 7– 8 క్వింటాళ్ల దిగుబడి వస్తుండంతో రైతులు సంబురపడుతున్నారు.

పెరిగిన మద్దతు ధర..

ఈఏడాది సోయా పంటకు ప్రభుత్వం మద్దత ధర పెంచింది. 2021– 22లో ప్రభుత్వ మద్దతు ధర రూ. 3,950 ఉండగా.. 2022– 23 సంవత్సరంలో రూ. 4,300 మద్దత ధర పెరిగింది. ఈఏడాది మద్దత ధర రూ 4,892కు పెంచింది. క్వింటాల్‌పై రూ. 592 మద్దతు ధర పెరిగింది. ఇది కూడా రైతులకు కలిసి వచ్చింది.

పెరిగిన సాగు..

గతేడాది జిల్లాలో సోయా పంట 49 వేల ఎకరాల్లో సాగు చేయగా.. కేవలం 2.50 లక్షల 25 వేల క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వచ్చింది. ఈఏడాది 52 వేల ఎకరాల్లో సోయా పంట సాగు కాగా.. ప్రసుతం ఎకారానికి 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడులు వస్తుండటంతో ఈలెక్కన 3లక్షల 64 వేల క్వింటాళ్ల వరకు దిగుబడులు రానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

మద్దతు ధర పెరిగింది



ఈ ఏడాది నాలుగు ఎకరాల్లో సోయా సాగు చేశాను. 32 క్వింటాళ్ల సోయాల దిగుబడి వచ్చింది. గతేడాది ఇదే భూమిలో 16 క్వింటాళ్ల సోయాలు దిగుబడులు వచ్చాయి. మద్దతు ధర పెరగడం కూడా కలిసి వస్తోంది.

– చంద్రశేఖర్‌రెడ్డి, ఇచ్చోడ

మంచి దిగుబడి వస్తుంది



ఈఏడాది సోయాకు ఆశించిన మంచి దిగుబడులు వస్తున్నాయి. వర్షపాతం ఎక్కువగా నమోదైనా ఆశించిన స్థాయిలో కాతపూత వచ్చింది. ఎకారంలో 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు దిగుబడులు వస్తున్నాయి.

– మానే బాలాజీ, దాబా(కె)

చదువుతోనే ఆదివాసీల జీవితాల్లో మార్పు



సన్మానిస్తున్న ఆదివాసీ పర్దాన్ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: చదువుతోనే ఆదివాసీల జీవితాల్లో మార్పు వస్తుందని ఆదివాసీ పర్దాన్ సమాజ్ నాయకులు అన్నారు. ఇటీవల ఉపాధ్యాయులు, జూనియర్ లెక్చరర్లుగా ప్రభుత్వ కొలువులు సాధించిన ఆదివాసీ పర్దాన్ సమాజ్ వారిని రాష్ట్రీయ పరధాన్ జన్‌జాతి ఉత్థాన్ సంఘటన్ ఆధ్వర్యంలో శాలువాతో సత్కరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని యాదవ సంఘ భవనంలో సన్మానించారు. యువత వీరిని ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో నాయకులు గేడం ప్రదీప్, సిడాం రాంకిషన్, పూసం ఆనంద్ రావు, కుర్సెంగే తానాజీ, మడావి బాపురావు, గేడం మాధవ్, సెడ్మకి సుభాష్, మెస్రం శంకర్, మడావి శంకర్, అర్క ఖమ్ము, మనోహర్, యాదవ్‌రావు పాల్గొన్నారు.

భీం వర్ధంతి విజయవంతం చేయండి

నార్నూర్: ఈనెల 22న మండల కేంద్రంలోని కుమురం భీం భవన్ వద్ద నిర్వహించే భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్ అన్నారు. ఆదివారం మాన్కాపూర్ గ్రామంలో మాట్లాడారు. ఆదివాసీ హక్కుల సాధన కోసం జల్, జంగల్, జమీన్ కోసం నైజాం సర్కారుతో విరోచిత పోరాటం చేశారని గుర్తు చేశారు. ఆయన వర్ధంతి సందర్భంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి తొమ్మిది తెగల ఆదివాసీలు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జైభారత్ అధ్యక్షుడు పెందూర్ దీపక్, తుడుందెబ్బ మండలాధ్యక్షుడు ఆడ శ్రీరాం, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ వేడుకలు



బతుకమ్మలను నిమజ్జనానికి తీసుకెళ్తున్న మహిళలు

నేరడిగొండ: మండల వ్యాప్తంగా బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. ఆదివారం వడూర్ గ్రామంలో మహిళలు బతుకమ్మ సంబురాలు జరుపుకున్నారు. రంగు రంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ప్రత్యేక పూజలు చేశారు. బతుకమ్మల చుట్టూ పాటలు పాడుతూ నృత్యం చేశారు. అనంతరం గ్రామ సమీపంలోని వాగులో నిమజ్జనం చేశారు. దీంతో గ్రామంలో పండుగ వాతావరణ నెలకొంది.

ప్రభుత్వ గెస్ట్ లెక్చరర్స్ కార్యవర్గం ఎన్నిక



కార్యవర్గ సభ్యులతో గెస్ట్ లెక్చరర్స్

కైలాస్‌నగర్: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల గెస్ట్ లెక్చరర్స్ కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు ప్రభుత్వ కళాశాలల్లో పనిచేసే గెస్ట్ లెక్చరర్స్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో సమావేశమయ్యారు. అనంతరం రాష్ట్ర కమిటీ సభ్యులు సోగల ప్రవీణ్ కుమార్, సయ్యద్ జావేద్ అలీల ఆధ్వర్యంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా ఆర్. శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా సుభాష్, ప్రధాన కార్యదర్శిగా బి.రాహుల్, సహాయ కార్యదర్శిగా విద్యారాణి, కోశాధికారిగా ఆనందంను ఎన్నుకున్నారు.

తాత్కాలిక రోడ్డుపై తప్పిన ముప్పు



వాగులోకి దూసుకెళ్లిన కారును రోడ్డుపైకి తీసుకొస్తున్న స్థానికులు

ఖానాపూర్: మండలంలోని దిలావార్‌పూర్ నుంచి ఖానాపూర్ మార్గంలోని రెంకోనివాగుపై వంతెన పనుల్లో భాగంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక రోడ్డుపై కారు అదుపు తప్పింది. వర్షాలకు కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డుకు గోసంపల్లె గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు కరిపె రాజ్‌కుమార్ మొరం పోయించి రాకపోకలు పునరుద్ధరించారు. ఇటీవల వర్షం కారణంగా రోడ్డు స్వల్పంగా దెబ్బతిని ప్రమాదకరంగా మారింది. ఆదివారం ఒగులాపూర్‌కు చెందిన ఓ కారులో పలువురు పాత ఎల్లాపూర్‌వైపు వెళ్తుండగా వాగువైపు దూసుకెళ్లింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో అదుపు తప్పింది. కారును ట్రాక్టర్ సాయంతో రోడ్డుపైకి తేవడంతో రాకపోకలు ప్రారంభమయ్యాయి.

ఉద్యోగ విరమణ సహజమే



లింగన్నను సన్మానిస్తున్న ఆడే గజేందర్

నేరడిగొండ: ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ సహజమేనని కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. నేరడిగొండ మండల కేంద్రానికి చెందిన పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ పట్టీపు లింగన్న ఉద్యోగ విరమణ కార్యక్రమానికి ఆదివారం హాజరయ్యారు. ఈసందర్భంగా శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగంలో ఎలాంటి పొరపాట్లు లేకుండా జిల్లా పోలీసు శాఖలో సేవలందించారని కొనియాడారు. శేష జీవితం ఆయురారోగ్యాలతో గడపాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఆడే వసంతరావు, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బద్దం పోతారెడ్డి పాల్గొన్నారు.

దీపావళి పూజలకు నూనె తయారు



నువ్వుల నూనె తయారు చేస్తున్న ఆదివాసీలు

ఇంద్రవెల్లి: ఆదివాసీలు దీపావళి పండుగను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. దీపావళి సమీపిస్తుండడంతో దేవతలకు నైవేద్యం కోసం, యేత్మసుర్ దేవతలకు దీపారాధన కోసం, స్వచ్ఛమైన నువ్వుల నూనె తయారీలో నిమగ్నమయ్యారు. ఆదివారం మండలంలోని పొల్లుగూడలో గానుగ ద్వారా నూనె తయారు చేశారు.

అభ్యర్థులకు న్యాయం చేయాలి

ఎదులాపురం: జిల్లా విద్యాశాఖ తప్పిదం వల్ల డీఎస్సీ 2024లో నష్టపోయిన అభ్యర్థులకు న్యాయం చేయాలని టీయూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీకాంత్, జలంధర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కౌన్సెలింగ్ ప్రక్రియ జరుగుతున్నప్పుడు మూడు రోజుల్లో నష్టపోయిన అభ్యర్థులకు ఉత్తర్వులు ఇస్తామని రాసిచ్చి కౌన్సెలింగ్ ప్రక్రియను కొనసాగించారని పేర్కొన్నారు. రానున్న రెండు రోజుల్లో అభ్యర్థులకు పోస్టింగ్ ఆర్డర్స్ ఇవ్వాలని, లేని పక్షంలో డీఈవో కార్యాలయం ఎదుట దశల వారి పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

గజేందర్‌కు సన్మానం



గజేందర్‌ను సత్కరిస్తున్న గ్రామస్తులు

నేరడిగొండ: కాంగ్రెస్ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్‌ను మండలంలోని నారాయణపూర్ గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఆదివారం మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామంలో నెలకొన్న పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఇతర అంశాల గురించి తెలియజేశారు. సానుకూలంగా స్పందించిన ఆయన సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు కార్తర్, రవి, వినోద్, సతీష్, నవీన్, రవి, గంగాసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రాథోడ్ రమేశ్ జయంతి



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఉట్నూర్‌రూరల్: ప్రజానాయకుడు, ఉమ్మడి ఆదిలాబాద్ రాజకీయాల్లో చరస్మరణీయంగా నిలిచిపోయిన మహోన్నత వ్యక్తి రాథోడ్ రమేశ్ జయంతి వేడుకలను బీజేపీ రాష్ట్ర నాయకులు రితేశ్ రాథోడ్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఉట్నూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పండ్లు పంపిణీ చేశారు. అనంతరం రాథోడ్ రమేశ్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు కొండేరి రమేశ్, కొలిపాక రాజశేఖర్, బింగి వెంకటేశ్, లింగాగౌడ్, గంగన్న, ధన్‌లాల్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి

- ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

ఇంద్రవెల్లి: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని డొంగర్‌గామ్‌లో ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆదివాసీలు సంప్రదాయ వాయిద్యాల మధ్య ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను విన్నవించారు. తమ గ్రామంలో తాగునీటి సమస్య అధికంగా ఉందని, త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కావడం లేదని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే డొంగర్‌గామ్ గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు విద్యుత్ శాఖ, ఐటీడీఏ అధికారులతో మాట్లాడి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమం గ్రామ పెద్దలు పెందోర్ బాదుపటేల్, కోవా భీంరావ్, ఆర్క సేడ్మరావ్, పెందోర్ బండు, పెందోర్ లింబారావ్, పుర్క భీంరావ్, రాము, మడావి లచ్చు, సురేందర్ పాల్గొన్నారు.

భీం ఆశయ సాధనకు కృషి చేయాలి



విగ్రహావిష్కరణ చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ

ఇంద్రవెల్లి: జల్ జంగల్ జమీన్ నినాదంతో పోరాడిన అమరజీవి కుమురం భీం ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. ఆదివారం మండలంలోని హీరాపూర్‌లో కుమురం భీం విగ్రహావిష్కరణ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ,ఆదివాసీల మనుగడ కోసం ఉద్యమించారని గుర్తు చేశారు. యువత భీం అడుగుజాడల్లో నడవాలన్నారు. కార్యక్రమంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సంకు, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మెస్రం దుర్గు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు పుర్క బాపురావ్, ఉట్నూర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, ఆత్రం భుజంగ్‌రావ్, కుమురం భీం మనువాడు సోనేరావ్ పాల్గొన్నారు.

'రైతుభరోసా' అందించాలి



ఇచ్చోడ: రాస్తారోకో చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

సాక్షి, నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రైతుభరోసా అందించాలని జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం ఆందోళనలు చేపట్టారు. ఎకరానికి రూ. 7500 ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక మాట తప్పిందని మండిపడ్డారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. నార్నూర్ మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద మాజీ జెడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్ రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. రేవంత్‌రెడ్డి రైతులకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బేల మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై నిర్వహించిన ఆందోళనలో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న పాల్గొని మాట్లాడారు. రైతులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గ్రామాల్లో అడ్డుకుంటామని హెచ్చరించారు.



బేల: దిష్టిబొమ్మను దహనం చేస్తున్న జోగు రామన్న



సిరికొండ: రోడ్డుపై బైఠాయించిన నాయకులు

ఆలయ కమిటీ ఎన్నిక



ఎన్నికైన నూతన కమిటీ

బోథ్: బోథ్ మార్కండేయ ఆలయ కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా సిరిపురం చంద్రమోహన్, ప్రధాన కార్యదర్శిగా భైరి రవి, కోశాధికారిగా ఆడెపు ప్రసాద్, కటకం నగేశ్, ఉపాధ్యక్షుడిగా తడక పోశెట్టి, గంగుల రవి, దాసరి గంగయ్య, సంయుక్త కార్యదర్శిగా కాడెరుగుల గణేష్, కట్కం రాజేంద్ర ప్రసాద్, పెంట నరేందర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం



నార్నూర్: గాదిగూడ మండలంలోని మేడిగూడ గ్రామానికి వెళ్లే రోడ్డు మార్గంలో ఉన్న భోజ్జుగూడ గ్రామం వద్ద కల్వర్టు పూర్తిగా తెగిపోవడంతో ప్రమాదం పొంచి ఉంది. దీంతో వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. అలాగే కొలామా గ్రామానికి వెళ్లే మార్గంలో తొయగూడ వద్ద కల్వర్టు పూర్తిగా దెబ్బతింది. ఖాండోవ్ కట్టగూడ వద్ద సైతం రోడ్ల కోతకు గురయ్యాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.